# ప్రబోధ 6

ఆధ్యాత్మిక ధార్మిక నైతిక సంపత్తికి ఆలవాలమైన భారతదేశములో అన్యాయ అక్రమ అనాచార అసత్య అధర్మ పైశాచిక ప్రవృత్తులు ప్రళయ తాండవం చేస్తున్న యీ సమయములో సత్య ధర్మ శాంతి ప్రేమలనే మానవత్వ గుణాలను సమాజములో ఆచరణీయంగా ప్రచారం చేయటానికి విద్యార్థులే సమర్థులు. భారతీయ విద్యార్థులు యీనాడు లౌకిక విద్యలను మాత్రమే తప్ప పారమార్థిక విద్యలను అభ్యసించటము లేదు. భారతీయ తత్వజ్ఞానము, భారతీయ ధార్మిక సిద్ధాంతములు, సంస్కృతీ సాంప్రదాయములు వీరికి అర్థం కావటం లేదు. భౌతికంగా యెంతగా అభివృద్ధి పొందుతున్నారో ఆధ్యాత్మికముగా అంత వెనుకబడి పోతున్నారు. కేవలం లౌకిక విద్యలు నేర్చుకోటం వలన ప్రయోజనము లేదు.

భారతదేశము ఆధ్యాత్మిక వాదానికి పుట్టినిల్లు. అఖండము, అనంతము అయిన భారతీయ సంస్కృతికి మూలాధారమైన వేదమును కర్మకాండ, ఉపాసనాకాండ, జ్ఞానకాండ అని వ్యాసమహర్షి మూడుగా విభజించాడు. వీటినే కాండత్రయములని, యోగత్రయములని అంటారు.

కర్మలు మాత్రమే చేయటంలో విశేషమేమీ లేదు. పశుపక్ష్యమృగాదులు సైతము కర్మలు చేయుచున్నవి. చిత్తశుద్ధి కావాలంటే కర్మఫల త్యాగము చేయాలి. 'కర్మకృత్ సంగవర్జితః' అని గీతాచార్యుడు చెప్పాడు. సర్వకర్మలు పరమాత్మప్రీత్యర్థం చేయాలి. కర్మఫలత్యాగ బుద్ధితో చేసే కర్తవ్యములే నిజమైన కర్మములు. ఫలాపేక్షతో కర్మలు చేయటం వలన త్యాగము, యోగము, క్షేమము దూరమై పోతున్నాయి. చిత్తశుద్ధి కోసమే కర్మలు చెయ్యాలి. కర్మవల్ల చిత్తశుద్ధి, ఉపాసనవల్ల చిత్తైకాగ్రత, జ్ఞానము వలన ఆనందము లభిస్తాయి. కర్మ చేయకుండా జ్ఞానము పొందటం సాధ్యం కాదు.

ప్రాథమిక పాఠశాలలో చదువకుండా హైస్కూల్ సెకండరీ పాఠశాలలో చేరటానికి వీలులేదు. హైస్కూల్ సెకండరీ పాఠశాలలో చదువకుండా కాలేజీలో చేరటానికి వీలులేదు. ప్రాథమిక పాఠశాలను కర్మమార్గంతోనూ, హైస్కూల్ సెకండరీ పాఠశాలను ఉపాసనా మార్గముతోనూ, కాలేజీని జ్ఞానమార్గముతోను పోల్చవచ్చును. జ్ఞానమార్గము ద్వారా ముక్తి పట్టా పొందగలము. ఈ అధికారము పొందటానికి కర్మమార్గము నుండి ప్రారంభించాలి. కాయమును సార్థకము చేసుకోటానికి కర్మలను, కాయ కర్మలను సార్థకము చేసుకోటానికి కర్తవ్యములను నిర్వర్తించాలి. కాల కర్మ కర్తవ్యములను అనుసరించినట్లైతే మానవత్వము పూర్ణత్వమును పొందుతుంది.

పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే.

విద్యాసముపార్జనలో యీనాడు జీవనోపాధిని మాత్రమే దృష్టిలో పెట్టుకుంటున్నారు కాని జీవన పరమావధిని లక్ష్యములో వుంచుకోటం లేదు. పుట్టటం, పెరగటం, సంపాదించటం జీవనాన్ని

వ్యర్థం చేయటం. ఇదే జీవితమైతే దీనివల్ల ఉపయోగమేమిటి? జీవనాన్ని సార్థకం చేసుకోవాలి. జగత్తులో మనము ఆశించవలసినది యేమిటి దేనిద్వారా ఆనందమనుభవించటం సాధ్యం అనే విషయంలో యోచించాలి. జీవనోపాధి ద్వారా కొన్నాళ్లు గడుపవచ్చు. కానీ జీవన పరమావధి భాగ్యమును పొందటానికి ఆత్మతత్త్వాన్నే ఆశ్రయించాలి. దేహము, మనసు, బుద్ధి, చిత్తము, యింద్రియములు, అంతఃకరణ - యిందులో యేది నిత్యం. ఏది అనిత్యం. ఏ పదార్థమును చూసినా కొంతకాలం సంతోషం కలుగవచ్చు. కానీ తరువాత అదే దుఃఖకరంగా మారుతుంది. జగత్తులో శాశ్వతమైనది యేదీ లేదు. ఆత్మతత్త్వమొక్కటే శాశ్వతమైనది. ఇట్టి ఆత్మతత్త్వాన్ని తెలుసుకోటానికి ఆధ్యాత్మిక మార్గమునే అనుసరించాలి. అయితే యిందుకు త్యాగభావము అవసరము. త్యాగములోనే యోగము వున్నది. క్షేమమున్నది. దీనిని మనము అర్థం చేసుకోటం లేదు. త్యాగములో అనేక కష్టనష్టాలున్నాయని తప్పు అర్థము చేసుకుంటున్నాము. అహంకారమును విడచి, స్వార్థభావమును త్యజించిన మనము యే పని చేసినా అది దైవప్రీత్యర్థం చేసినట్లే అవుతుంది.

భగవంతునికి యేది ప్రీతి. భగవంతుడు ప్రేమస్వరూపుడు. ప్రేమస్వరూపుడైన భగవంతునికి ప్రేమ కావాలి. ఆకాశములో నున్న చంద్రుని చూడటానికి చంద్రకాంతే కావాలి. టార్చిలైటో పెట్రొమాక్సో అవసరం లేదు. అదే రీతిగా ప్రేమస్వరూపుని ప్రేమ ద్వారానే దర్శించాలి. ప్రేమ లేకపోతే జీవితమే లేదు. ప్రేమే ప్రాణము. ప్రేమ జీవము. ప్రేమ పరమాత్మ స్వరూపము. ప్రేమే దైవము. దైవమే ప్రేమ. ప్రేమలో ప్రేమతో జీవించండి.

నేటి విద్యార్థులు ధర్మశాస్త్రమును, జ్ఞాన ప్రేమతత్త్వములను తెలుసుకొని తాము ఆచరిస్తూ ఆదర్శవంతులై ప్రబోధించాలి. తాము ఆచరించకుండా యింకొకరికి చెప్పబోతే అది హాస్యాస్పదమవుతుంది. మొదట తమ యిండ్లలో తమ కర్తవ్యాలను చక్కగా నెరవేర్చాలి. తల్లిదండ్రుల హృదయాలను ప్రసన్నం చేసుకోవాలి. మంచినే చూడాలి. మంచినే వినాలి. మంచినే తలంచాలి. మంచి మాత్రమే చేయాలి. మంచిగా మాట్లాడాలి. ఈ రీతిగా సద్గుణ సంపత్తిని అభివృద్ధిపరచుకోటమే నిజమైన విద్య. కేవలం గ్రంథపరిచయము విద్య కాదు. చిత్తశుద్ధి కలిగించేది నిజమైన విద్య. చిత్తశుద్ధికి నైతిక, ధార్మిక ఆధ్యాత్మిక సాధనలు అత్యవసరము. ఇవి లౌకిక భౌతిక ప్రవృత్తులతో జతగా కలసి వుండజాలవు. నైతిక ధార్మిక ఆధ్యాత్మిక ప్రవృత్తులు పాజిటివ్, భౌతిక లౌకిక ప్రవృత్తులు నెగెటివ్. మనసు బుద్ధి చిత్తము యింద్రియములు అంతఃకరణములను అధీనంలో పెట్టుకున్నప్పుడే మనము అధికారులము యజమానులము కాగలిగేది, లేనప్పుడు దాసులమే. పశుపక్షి మృగాదులు వాటి యిష్టానుసారము యింద్రియాలను వుపయోగిస్తూ సంతోషిస్తాయి. మనమూ యిదే రీతిగా ప్రవర్తిస్తే మనకు వాటికి వున్న వ్యత్యాసమేమిటి. మానవజన్మ వచ్చినప్పుడు దానికి తగిన రీతిగా వుండాలి. అజ్ఞానం లేకుండా వర్తించేవాడు మానవుడు. అజ్ఞానముతో జనించి అజ్ఞానముతో మరణిస్తే మనుష్యుడనటానికి వీలుందా. మనుష్యాకారముంది గానీ మనుష్యగుణాలు లేవన్నమాట. సత్య, ధర్మ, శాంతి ప్రేమ మనుష్యగుణాలు. కోపము, తాపము, ఈర్ష్య అసూయ, డంబము, అహంకారము యివి మృగలక్షణాలు. ఇట్టి పశుత్వాన్ని దూరం చేసుకోవాలి.

వేద విజ్ఞాన స్వరూపములో వున్న సనాతన ధర్మమే మనకు ఆధారము. దీనినే మనము

అనుసరించి ఆచరించాలి. విద్యార్థులు ఆదర్శ జీవితము గడిపి జగత్తుకు మార్గదర్శకులు కావాలి. ముఖ్యముగా సహన భావము, వినయ విధేయతలు కలిగి వుండాలి. స్వార్థ స్వప్రయోజన దృష్టిని విడనాడాలి. నేటి ప్రపంచములో పిల్లల మూలకంగానే అభివృద్ధి సాధించవలసి వుంది. డిగ్రీ సర్టిఫికెట్లు చేత బట్టుకొని ఆఫీసుల చుట్టూ సార్ ఉద్యోగం సార్ ఉద్యోగం అంటూ బిక్షమెత్తుకునేట్లు వారిని తయారు చేయటానికి మేము కాలేజీలు స్థాపించలేదు. విద్యార్థులు స్వశక్తితో సరియైన రీతిగా జీవించాలి గాని పరాధీనులు కారాదు. పరాధీనము కావటమంటే బానిసలు కావటమే. తమ పొలం పనులు చూసుకోవాలి. తల్లిదండ్రులకు సహాయపడాలి. ఏ బి.ఎ. చదివి యింటికి వెళ్ళి తండ్రి కష్టం చేస్తుంటే కాలు మీద కాలు వేసుకొని కుర్చీలో కూర్చోటం కంటె కఠినత్వము వుండదు. తల్లితండ్రులకు సహాయపడటం ద్వారా వారికి సుఖము చేకూర్చాలి. తల్లిని హింసించి, తండ్రి దగ్గర డబ్బులు అడిగి బజార్లలో తిరగటం విద్య కాదు. అది అవిద్య. మృగవిద్య.

ఈ క్షణంలో మనము బాగుండవచ్చు. మరుక్షణములో యేమవుతుందో చెప్పలేము. కనుక యెల్లప్పుడు నిత్యమై, సత్యమై, స్థిరమై వుండాలి. ధర్మతత్వమును బలముగా పట్టుకొని వుంటేనే మనుష్యులుగా మనగలుగుతాము! 'నశ్రేయో నియమం వినా'. నియమం లేక శ్రేయస్సు లేదు. పెద్దలకు గౌరవభావముతో నమస్కరించి వినయముగా ప్రవర్తించాలి. విచక్షణా జ్ఞానముతో వ్యవహరించాలి. ఎట్లంటే అట్లా మాట్లాడకూడదు. ఇష్టం వచ్చినట్లు నడచుకోకూడదు. పిల్లలు యీవిధముగా క్రమశిక్షణలో నడచుకుంటే భారతదేశ భవిష్యత్తు దేదీప్యమానంగా వెలుగుతుందనటానికి సందేహం లేదు.

నేటి విద్యాసంస్థలు సరస్వతీ నిలయాలు కాక లక్ష్మీ మందిరాలుగా మారిపోయాయి. ప్రవేశముతో సహా ప్రతిదానికి డబ్బు. కానీ మా యూనివర్సిటీలో ఒకటవ తరగతి మొదలుకొని పి.హెచ్.డి వరకు ఒక్క పైసా కూడ ఫీజు తీసుకోవటం లేదు. విద్యాసంస్థలు వ్యాపార సంస్థలు కారాదు. నిజమైన విద్యా విజ్ఞాన కేంద్రాలుగా అవి విలసిల్లాలి. అప్పుడే పిల్లలకు మంచి భవిష్యత్తు వుంటుంది. వారు చదువుకున్న విద్య సమాజానికి వుపయోగపడుతుంది. విద్యావంతులైన పిల్లలు గ్రామాలకు వెళ్ళి పేద ప్రజలకు సహాయము చెయ్యాలి. ఆరోగ్యసూత్రాలను బోధించాలి. దురలవాట్లను మాన్పించటానికి ప్రయత్నించాలి. అందుకు తాము త్యాగము చేయవలసి వుంటుంది. నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక కర్మలు యెప్పుడు పరోపకార దృష్టితోనే చేయాలి. ఒకరికి వుపకారము చేయకున్నా అపకారము మాత్రము చేయకూడదు. ఇతరులకు చెప్పటానికి ముందు తాము అందుకు అధికారము, యోగ్యత సంపాదించాలి.

అందరిలోనూ పరమాత్మ శక్తి వుంది. అది లేకపోతే మాట్లాడటం కూడా చేతకాదు. భగవంతుడు వున్నాడని చెప్పేవారితో బాటు లేడని చెప్పేవారు కూడా భగవంతుని చూసే వుండాలి. దీనికి ఒక ఉదాహరణ. బల్లపైన గ్లాసును చూచినవాడు గ్లాసు వుంది అంటాడు. దానిని తీసి అడిగితే లేదు అని మరొకడు చెప్తాడు. ఉందని చెప్పినవాడు, గ్లాసును చూసినట్లే లేదని చెప్పినవాడు కూడా దానిని చూసే వుండాలి కదా. నాస్తికులు భగవంతుని చూస్తే కదా భగవంతుని విషయము వారికి తెలిసేది. ఆరోగ్యవంతులు స్వీటులోని తీపిని అనుభవించగలరు గాని మేహవ్యాధి గలవారు దాని రుచి చూడటానికి కూడా వీలులేదు. రుచి చూస్తే కదా తెలిసేది. దేవుడు లేడని చెప్పేవారు జగత్తులో వుండటానికి వీలులేదు.

ఎందుకంటే తానే దేవుడు. దేవుడు లేడంటే తాను లేనట్లే. ప్రతి జీవిలోనూ దేవుడున్నాడు. మరి లేడని చెప్పటము ఎట్లా సాధ్యం. ఇలాంటి అసత్యపు మాటలను యెంతమాత్రం చెవిని పెట్టకూడదు.

అధ్యాపకులు, తల్లితండ్రులు పిల్లల హృదయాలలో ఆత్మవిశ్వాసాన్ని కలిగించాలి. ఆత్మతత్వం తప్ప జగత్తులో మరేమీ లేదు. అదే సర్వస్వరూపం. ఈశావాస్యమిదం సర్వం అన్నా, వాసుదేవ సర్వమిదం అన్నా, ఈశ్వర స్సర్వభూతానాం అన్నా అంతా ఆత్మతత్వమే. కరెంటు బల్బులలో, ఫ్యానులలో, యంత్రాలలో చేరి ఒక్కొక్క దానిలో ఒక్కొక్క పని చేస్తూ వున్నది. ఒక్కొక్క పనికి ఒక్కొక్క ఫలము. అయినా అన్నిటికీ మూలం ఒక్క కరెంటు మాత్రమే. అదేరీతిగా జగత్తు మూలాధార తత్వమని అర్థం చేసుకోవాలి. గ్లాసులో నీరున్నది. నీటి అడుగు భాగములో చక్కెర వున్నది. పైపై నీరు త్రాగితే తీపిగా వుండదు. స్పూనుతో కలియగలుపితే నీరంతా తీపిగా వుంటుంది. అదేరీతిగా హృదయము ఒక పాత్ర. ప్రాపంచికమైన ఆశలు నీరు. ఆ నీటి అడుగుభాగములో ఆత్మతత్వమనే చక్కెర వుంది. అదే దివ్యత్వము. బుద్ధి అనే స్పూనుతో కలియగలపటమనే సాధన చేస్తే సర్వవ్యాపియైన ఆత్మతత్వము అర్థమవుతుంది.

చేత్తో చేసే పని, నోటితో చెప్పే మాట రెండూ ఒకటిగా వుండాలి. మనస్సులో ఒకటి, మాటలో ఒకటి, ఆచరణలో మరొకటి దురాత్ముల లక్షణము. మనస్యేకం, వచస్యేకం, కర్మణ్యేకం మహాత్ముల లక్షణం. ఈనాడు దురాత్ముల సంఖ్య పెరగటానికి కారణం ఆధ్యాత్మిక తత్వాన్ని విస్మరించటమే. మనసు మాట క్రియ మూడు ఒకటి కావాలి. దీనిని పిల్లలు యీ వయసు నుండే సాధన చెయ్యాలి. ఈరోజుల్లో పల్లెప్రజలను నిజంగా సేవ చేసేవారే లేరు. ఎవ్వరూ పట్టించుకోని వారి సేవను మీరు పూనుకోవాలి. పల్లెప్రజల సేవ మీ కర్తవ్య కర్మ. కర్తవ్యకర్మ ఆచరణయే నిజమైన విద్య.

ఎల్లవేళలా మనలో వున్న పరమాత్మ మనతోడుగా వుంటాడు. ఆ పరమాత్మ మన హృదయవాసి. హృదయము అనే మాటలో హృ-ము అనే అక్షరాల మధ్య దయ వుంది. దయగల హృదయమే దైవమందిరము. దయ, ప్రేమ లేకపోతే కేవలము కఠినత్వమే మిగులుతుంది. మనలో అన్యాయ అక్రమ అనాచారములను నింపుకొని వుంటే యింక ప్రేమ యెక్కడనుండి వస్తుంది. నిజమైన ప్రేమ హృదయము లోపలినుండి రావాలి. పైపైన తెచ్చిపెట్టుకొనే నవ్వు సినిమా నవ్వు. హృదయపూర్వకమైన ప్రేమ దైవప్రేమ. ప్రతి జీవిలోనూ ప్రేమరూపంలో మీరు పరమాత్మను దర్శించాలి. ఆ పరమాత్మ సేవ చేయాలి. కేవలం పుస్తకాలు చదివి భౌతిక, లౌకిక విజ్ఞానాన్ని పొందినంత మాత్రమున ప్రయోజనము లేదు. జ్ఞానమనే పదాన్ని విడదీస్తే జ్ఞా అంటే జ్ఞానము. న అంటే లేదు. అనగా నిజమైన జ్ఞానము శాశ్వతమైన జ్ఞానము కానిది అని అర్థము. శాశ్వతమైనది, నిజమైనది ఆత్మమాత్రమే. ఇదే సర్వవ్యాపి. ఇది మాటలతో చెప్పితే అర్థమయ్యేది కాదు. దీనికి సాధన అవసరము.

పుట్టటం చావటం, చావటం పుట్టటం మాత్రమే మన జీవితము కాదు. మనమింక మళ్లీమళ్లీ పుట్టరాదు. మళ్లీ పుట్టకుండా వుండటానికే మనము పుట్టింది. ఇదే మనము తెలుసుకోవలసినది. ఇదే ఆత్మజ్ఞానము. ఒకసారి పుట్టిన తరువాత మళ్లీ యింకొకసారి పుట్టకూడదు. ఇవాళ్టి న్యూస్ పేపరు రేపు వేస్టు పేపరు. దానినెవరూ చదవరు. ఒక వ్యక్తి జైలుకు వెళ్లి విడుదలై వచ్చాడంటే మళ్లీ

1-08-02-87-05

జైలుకువెళ్లకూడదు.

దొంగతనము చేసి పట్టుబడ్డ ఒక వ్యక్తికి పదేళ్లు కఠిన శిక్షపడింది. శిక్షపూర్తి కాగానే జైలు అధికారి నిన్ను వదిలేస్తున్నాం, నీ తట్ట బుట్ట మూటగట్టుకొని యింటికి వెళ్లు అన్నాడుట. ఆదొంగ యివన్నీ యెందుకు సార్! అన్నీ యిక్కడే వుండనీయండి రేపే మళ్లీ వస్తాను అన్నాడుట. పదేళ్లు శిక్ష అనుభవించినా మళ్లీ జైలుకు రావాలనే వుందతనికి. దృష్టి దొంగతనము మీదేవుంది. ఈ విధముగా దొంగలము కారాదు. జననమనే జైలుకు మళ్లీ రాకూడదు. అజ్ఞానమే దొంగతనము. ఈ అజ్ఞానమే నాశనమైతే మళ్లీ జన్మలేదు. పరమాత్మ చింతన చేయాలి. పరమాత్మని స్మరించాలి. భజించాలి. పరమాత్మ సేవ చేయాలి. అదే జన్మ సార్థక మార్గము.

మొద్దనహళ్లి.